క్లుప్తంగా

నేడు బడంగ్‌పేట్‌కు మంత్రి శ్రీధర్‌బాబు రాక

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఐటీ, భారీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌కు ఉదయం 10 గంటలకు రానున్నట్లు మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో రూ.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపనలు నిర్వహించేందుకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. మంత్రితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, చేవేళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి కూడా విచ్చేయుచున్నారని తెలిపారు.

ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో ఘనంగా బోనాలు



అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

మీర్‌పేట: మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని లార్డ్స్ పాఠశాలలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు సంప్రదాయ దుస్తుల్లో హాజరై అమ్మవారికి బోనం సమర్పించారు. పోతరాజుల వేషధారణలో విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఛైర్మన్ సిద్ధాల బీరప్ప మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు తెలియజేసేందుకే పాఠశాలలో బోనాల వేడుక నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట– అంగన్‌వాడీ బాట నిర్వహించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ సెంటర్ మార్చుతూ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నదన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలోనే చేర్పించాలని కోరారు.

కొనసాగుతున్న దీక్షలు



కందుకూరు: బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న కార్మికులు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కార్యాలయం ఆవరణంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగించారు. దీక్షలో భాగంగా కార్మికులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన చేపట్టనున్న కలెక్టరేట్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ప్రభావతి, సభ్యులు గీత, లక్ష్మీ, శంకరమ్మ, అలివేలు, భారతమ్మ, అండాలు, విజయమ్మ, లావణ్య, అశ్విని, లక్ష్మిభాయి పాల్గొన్నారు.

సత్కారం



మన్సూరాబాద్: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు.

ప్రజాధనం రోడ్ల పాలు

- అవసరం లేని చోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- చిరువ్యాపారులకు అడ్డాగా మారుతున్న వైనం
- వృథా అవుతున్న ప్రజాధనం



వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్-ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం తవ్విన రోడ్డు

వనస్థలిపురం: బాగున్న రోడ్లకే మళ్లీ సొబగులు, అధ్వాన రోడ్లను అసలు పట్టించుకోరు అనే తీరున జీహెచ్ఎంసీ అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఎన్నో శివారు కాలనీలు రోడ్లు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు లేక ఏళ్లుగా సమస్యలతో సతమతం అవుతున్నా అటుగా దృష్టిసారించని అధికారులు అవసరం లేనిచోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం పేరున ప్రజాధనం వృథా చేస్తున్నారు. వనస్థలిపురంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో మసీదు రూటులో కొన్నేళ్ల క్రితం అవసరం లేకున్నా ప్రత్యేక నిధుల పేరుతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. జన సంచారం అధికంగా లేని ఆ రూటులో ఫుట్‌పాత్‌ల నిర్మాణంపై అప్పట్లోనే స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. వారు భావించినట్లుగానే ఆ ఫుట్‌పాత్‌లు నిరుపయోగంగా మారి చిరువ్యాపారులకు అడ్డాగా మారాయి. కాగా మళ్లీ వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ఎన్జీవోస్ కాలనీ వైపు రోడ్డుకు ఇరువైపులా రూ.80 లక్షలతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. అసలే 60 ఫీట్ల రోడ్డులో రెండు వైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో రోడ్డు మరింత కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు, ఆ రూటులో ఉన్న షాపులకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు మరింత సమస్య వచ్చే అవకాశం ఉంది. షాపుల ముందు రోడ్డు తవ్వకాలు చేపట్టడంతో వినియోగదారులు రాలేక తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. పనులు కూడా నాసిరకంగా జరుగుతున్నాయని, కమీషన్ల కోసమే అధికారులు అవసరం లేనిచోట ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతూ ప్రజల సొమ్ము వృథా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చిరు వ్యాపారులకు అడ్డాగా మారిన మసీదు రోడ్డు ఫుట్‌పాత్



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

హుడాకాంప్లెక్స్: పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించడంతో పాటు 50శాతం పీఆర్‌సీ, ఫిట్మెంట్‌ను ప్రకటించాలని పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కన్నయగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. శుక్రవారం సరూర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీఓ నె11,12లను సవరించి బీఈడీ విద్యా అర్హత కలిగిని వారికి పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ గౌరవ అధ్యక్షులు కొండాపల్లి నారాయణగౌడ్, కర్మన్‌ఘాట్, రాజీవ్ గాంధీనగర్, సరూర్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోండి



విద్యార్థి నాయకులుగా ఎంపికైన విద్యార్థులు

హస్తినాపురం: విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నీతి నిజాయితీకి మారుపేరుగా అందరికి ఆదర్శంగా నిలవాలని రవీంద్ర భారతి స్కూలు ప్రిన్సిపాల్ బ్యూలా అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ జిల్లా పరిషత్ రోడ్డులోని రవీంద్ర భారతి స్కూల్‌లో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాజకీయ నాయకులకు నిజాయితీ, క్రమశిక్షణ ఎంతో అవసరమని నేటి తరం రాజకీయ నాయకులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో నాయకులుగా ఎంపికైన చిన్నారులకు పతకాలను అందజేశారు. అనంతరం విద్యార్థి నాయకుడితో (ఎస్‌పిఎల్) ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీబాయి, డీఐ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో దోమల నివారణ



సమావేశంలో పాల్గొన్న చైతన్యపురి కాలనీవాసులు

హస్తినాపురం: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, కాలనీలు, తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యకమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తచెదారం వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాలనీవాసులదేనన్నారు. కాలనీల్లో దోమల నివారణకోసం మందులు పిచికారీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్ నర్సింహ్మా, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చైతన్యపురి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చైతన్యపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లె కృష్ణ మూర్తి అన్నారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం, కాలనీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని ఆహార వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని, చెత్త ఆటో కార్మికులకు అందజేయాలన్నారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయటం వల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పూల కుండీలు, పాతవస్తువులలో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసి సిబ్బంది రత్న, గణేష్‌రెడ్డి, ఇందిర, సంఘం ప్రధాన కార్యదర్శి జువ్వాది రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరి ఎస్‌పి శాస్త్రి, కాలనీవాసులు ఏవి చెన్నయ్య, పార్థసారధి, శివయ్య, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మీగణపతి ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ బ్యాంక్‌కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు, 11కేవీ పోస్టాఫీసు, శివాలయం, ప్రజయ్‌నివాస్, యాదవనగర్, రాక్‌టౌన్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ ఆర్‌కేపురం, చాణక్యపురి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు, 11కేవీ తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీ ఖిల్లా మైసమ్మ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మౌలికవసతుల కల్పనకు చర్యలు

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



అంబేద్కర్‌నగర్‌లో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: రోజురోజుకు పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. శుక్రవారం అంబేద్కర్‌నగర్ కాలనీలో చేపట్టిన రోడ్లు, మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని, అధికారులు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించమన్నారు. ఈ కార్యక్రమంలో లోడి నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధుల నియంత్రణ

నాగోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ సమతా పురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ వర్షా కాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెత్తా చెదారం బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలన్నారు.

నేటినుంచి సురభి నాటకోత్సవాలు

వనస్థలిపురం: శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) వారిచే వనస్థలిపురం హుడా ఆడిటోరియం గ్రౌండ్ లోని సురభి థియేటర్‌లో శని, ఆది వారాల్లో సాయంత్రం 6.30 గంటలకు శ్రీ శ్రీనివాస కల్యాణం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు వేణుగోపాలరావు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

‘పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి’

కందుకూరు: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు సిద్ధు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోనే ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.730 కోట్లు ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాల వేధింపులతో వారు చదువుపై దృష్టిసారించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్, వినోద్, సందీప్, యోగేందర్, శివ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీతో పేద రైతులకు ఊరట

మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో సంబరాల్లో మాజీ ఎమ్మెల్యేలు కేఎల్‌ఆర్, తీగల

హుడాకాంప్లెక్స్: రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రైతు రుణమాఫీ చేశారని, సాహసోపేతమైన ఈ నిర్ణయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పేద రైతులకు ఎంతో ఊరట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, మహేందర్‌యాదవ్, శంకర్‌యాదవ్, ఇమ్రాన్‌అలీ, అరుణ, నీలకంఠం, నాగమణి, సంగీత, సంతోష్, నయీమ్, షఫీ, అలీభాయ్, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ సర్కారు

మహేశ్వరం: రైతుల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని రావిర్యాల ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునగని రాజు కొనియాడారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు ప్రత్యేక చొరవ తీసుకొని మొదటి విడతలో భాగంగా లక్ష రూపాయాల రుణాలను మాఫీ చేశారన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగా రెడ్డి, యాదయ్య, బాబయ్య, కె.యాదయ్య, బాల్‌రాజ్, రాజ్‌కుమార్, జంగయ్య, గోవర్ధన్‌రెడ్డి, రంజిత్‌కుమార్, బాలయ్య, శ్రీనివాస్, అర్జున్, నర్సింహారెడ్డి, సుధాకర్, మధుకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రుణాలు అందిస్తాం

కందుకూరు: పంట రుణమాఫీ పొందిన రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పీఏసీఎస్ ద్వారా పంట రుణమాఫీ పథకం కింద రూ.లక్ష వరకు 1,568 మంది రైతులకు రూ.5.22 కోట్లు రావాల్సి ఉండగా, 565 మంది రైతులకు రూ.2.17 కోట్ల వరకే వచ్చాయన్నారు. మరో వెయ్యి మంది వరకు రావాల్సి ఉందన్నారు. రూ.1.50 లక్షల వరకు 297 మందికి రూ.3.15 కోట్లు, రూ.2 లక్షల్లోపు 116 మందికి రూ.1.99 లక్షలు రుణమాఫీ రావాల్సి ఉందన్నారు. కాగా ప్రస్తుతం మాఫీ అయిన రైతుల్లో 33 మంది పూర్తిగా చెల్లించారని వారికి చెక్కులు అందిస్తామన్నారు.

స్వీట్లు పంచి.. సంబరాలు చేసి

కందుకూరు: రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నేదునూరులో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకుడు జి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేశారు. ఇచ్చిన మాట మేరకు రుణ మాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, రూప్‌చందర్, మాధవరెడ్డి, బాబు, నర్సింహ, బాలయ్య, రాకేష్‌గౌడ్, రాములుగౌడ్, బలవంత్‌రెడ్డి, భాస్కర్, దర్శన్, ఎండీ పర్వేజ్, గణేష్, ఎండీ సద్దాం, కృష్ణనాయక్, శ్రీశైలం, రాములు, లక్ష్మమ్మ, అఫ్జల్‌బేగం, సంజీవరెడ్డి, నాగరాజు, ఆసీఫ్, వెంకటయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: రావిర్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



కందుకూరు: నేదునూరులో..

బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం బొడ్రాయికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, పుష్పాలంకరణతో పాటు పలు పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమారి రాయప్ప, మాజీ ఉప సర్పంచ్‌లు చాకలి యాదయ్య, పోతుల నర్సింగ్, గ్రామస్తులు అంజయ్య, బాలయ్య, దేవరంగౌడ్, యాదయ్య, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమీర్‌పేటలో బొడ్రాయిని ఊరేగిస్తున్న గ్రామస్తులు